# అపరాధి - మహాపరాధి

"ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేదోయి"

ఈపాట ఆ సన్నివేశానికి సరిపోతుంది. అలాగని ఆ పాటను అన్నిటికీ, అందరికీ వర్తింపజేయలేం.

ప్రేయసీ ప్రియులకే ఆ పాట వర్తించకపోవచ్చు. ప్రేయసి ఇచ్చింది ప్రియుడికి హాయి కావచ్చు. అలాగే ప్రియుడు ఇచ్చింది ప్రేయసికి హాయి కావచ్చు. అంటే పుచ్చుకున్న వాళ్ళకి హాయి అన్నమాట. అలాగని ఇచ్చిన వాళ్లకు హాయి ఉండదనలేం. మనసులు ఇచ్చి పుచ్చుకున్న వాళ్ళిద్దరికీ హాయి ఉండవచ్చు.




ఇవ్వడాలూ పుచ్చుకోడాలూ ఇష్టాలూ అవసరాలూ ప్రయోజనాలను బట్టి ఉంటాయి.

కుచేలుడు తన అవసరం కోసం శ్రీకృష్ణుడికి ఇష్టమైన అటుకులు పట్టుకెళ్ళి ఇచ్చాడు. ఆ కాసిన్ని అటుకులూ సంపాదించడానికి కుచేలుడు ఎంతో కష్టపడ్డాడు. అలాంటి పరిస్థితిలో ఉన్నందువల్లే కుచేలుడు దారిద్ర్యానికి చిహ్నమయ్యాడు. తన చిన్ననాటి స్నేహితుడు కృష్ణుణ్ణి కలిస్తే, తన దరిద్రం పోతుందనుకున్నాడు. వట్టి చేతులతో వెళ్ళకూడదని అటుకులు పట్టుకెళ్ళి ఇచ్చాడు. కృష్ణుడు గుప్పెడు అటుకులు పుచ్చుకున్నాడు. కుచేలుడికి ఐశ్వర్యం ఇచ్చాడు.

ఇచ్చిపుచ్చుకోడాల్లోనే ఈ ప్రపంచ మనుగడ ఉంది. ఇచ్చినవాడు పుచ్చుకుంటాడు. పుచ్చుకున్నవాడు ఇచ్చుకుంటాడు.

కృష్ణుడు అటుకులు పుచ్చుకుని కుచేలునికి ఐశ్వరం ఇచ్చుకున్నాడు. కుచేలుడు అటుకులు ఇచ్చి ఐశ్వర్యం పుచ్చుకున్నాడు. ఈ ఇచ్చి పుచ్చుకోడాల వెనక స్నేహం, ప్రేమ, అభిమానం వంటివి ఉంటాయి.

సాంఘిక జీవనంలో ఇచ్చి పుచ్చుకోవడాలు తప్పనిసరి. ఒకప్పుడు ఈ ఇచ్చిపుచ్చుకోడాలు వస్తు మార్పిడిగా జరిగేవి. ఒకరికి పండిన ధాన్యం ఇచ్చి ఇంకొకరికి పండిన కందులు పుచ్చుకునేవారు. నాణేలు వాడుకలోకి వచ్చేక, డబ్బు ఇచ్చి, వస్తువులు పుచ్చుకోవడం మొదలయ్యింది.

అందుచేత ఆర్థికశాస్త్రం కూడా అంతా ఇచ్చి పుచ్చుకోవడాల్లోనే ఉంది.

ఇచ్చిపుచ్చుకోడాలు సవ్యంగా ఉంటే అంతా సజావుగానే ఉంటుంది. ఇది మానవ సంబంధాలకే కాదు, ఆర్థిక సంబంధాలకూ వర్తిస్తుంది.

పాలించేవాడు ప్రజలకు ఏదో ఇచ్చినట్టు కనిపిస్తూ వాళ్ళ దగ్గర నుండి పన్నుల రూపంలో డబ్బు పుచ్చుకుంటాడు. ఆ గ్రహింపు రానంతవరకూ ప్రజలు తమ శ్రమనంతా పాలకులకు ధారపోస్తారు.

పాలకులు కొంతకాలానికి పుచ్చుకోవడమే తమ హక్కు అనుకుంటారు. ఇచ్చుకోనక్కర్లేదనుకుంటారు. అప్పుడు ప్రజలు ఒక్కటిచ్చుకుని బుద్ధి చెబుతారు.

అలాగే మగాడూ పుచ్చుకోడానికే పుట్టాననుకుంటే ఆడది రెండిచ్చుకుని దారిలోకి తెస్తుంది. పెడదారిలోనే ఉంటాననే మగవాణ్ణి పెరట్లోకి కూడా రానివ్వనంటుంది నేటి స్త్రీ. ఇచ్చిపుచ్చు కోడాలు సమానంగా ఉండాలన్నమాట. అలా ఉండాలని అందరూ ఆశిస్తారు.

సృష్టిలో అలా ఆశించనిది తల్లి ఒక్కర్తే. బిడ్డలకోసం తన సర్వస్వమూ ఇస్తుంది. బిడ్డల నుంచి ఏదో పుచ్చుకుందామనుకోదు. ఇక్కడా ఒకోసారి మినహాయింపులుంటాయి.

పచ్చనిచెట్టు కూడా తల్లి లాంటిదే. అయితే చెట్టు నీరు, సూర్యకాంతి, నేలసారం పుచ్చుకుని ఫలాలిస్తుంది. ఇక్కడ ఇచ్చిపుచ్చుకోడాల వెనక స్వార్థం లేదు

రాజకీయ నాయకులు వాగ్దానాలు ఇచ్చి, ఓట్లు పుచ్చుకుంటారు. డబ్బులిచ్చి ఓట్లు పుచ్చుకుంటారు. డబ్బులు పుచ్చుకుని ఓట్లు ఇచ్చుకున్న జనం 'అనుభవం' తెచ్చుకుంటారు.

ఉద్యోగి జీతం పుచ్చుకుని తన పనితనం ఇచ్చుకుంటాడు. ఆ ఇచ్చిపుచ్చుకోడాలు సమానంగా లేకపోతే సమ్మెకు దిగుతాడు.

జీతం పుచ్చుకుని సరిపుచ్చుకోలేని ఉద్యోగి 'గీతం' కోసం చూస్తాడు. టేబుల్ కింద చెయ్యి పెడతాడు. 'గీతం' కోసం చెయ్యాల్సిన పని ఆపుతాడు. ఆ పని కావాల్సిన వాడు కొంత డబ్బు ఇచ్చుకుని, తన పని జరిపించుకుంటాడు. దీన్నే లంచం అనీ ఆమ్యామ్యా అనీ అంటారని అందరికీ తెల్సు.

ఇది ఇచ్చిపుచ్చుకోడాల్లో మొదలైన అవినీతి.

ఇక డబ్బులిచ్చి, ఓట్లు పుచ్చుకున్న రాజకీయ నాయకుడు అంతటితో ఊరుకోడు. తమ ఓట్లకోసం ఇచ్చిన డబ్బుకు పదింతలు సంపాదించాలనుకుంటాడు. పదింతలు సంపాదించాలంటే పది రకాల పాపాలు చేయక తప్పదు.

ఓట్లు పుచ్చుకోవడం కోసం నోట్లు ఇచ్చుకోడానికి డబ్బు కావాలి కదా. అందుకోసం రాజకీయ నాయకులు పెద్ద పెద్ద వ్యాపారుల నుంచి విరాళాలు పుచ్చుకుంటారు. వ్యాపారులు ఎందుకు ఇచ్చుకుంటారు? తామిచ్చిన విరాళాలకు రాజకీయ నాయకుల ద్వారా పనులు చేయించుకుని పదింతల డబ్బు పుచ్చుకోవాలనుకుంటారు.

అమెరికాకు డబ్బు ఇచ్చి ఎన్నో దేశాలు ఆయుధాలు పుచ్చుకుంటాయి. తమ వ్యాపారం బాగా సాగడానికి అమెరికా లాంటి దేశాలు దళారీలకు కమిషన్లు ఇచ్చుకుంటాయి. ఫలానా దేశం నుంచి ఆయుధాలు కొంటే మనదేశానికి మేలు జరుగుతుందని కొందరు రాజకీయ నాయకులే దళారీలుగా మారి లోపాయికారీగా కమిషన్లు పుచ్చుకుంటారు. అవి బయటపడితే కుంభకోణాలు అంటాం. అలాంటి కుంభకోణాల్లో స్విస్ బ్యాంకుల అకౌంటులూ వెలుగులోకి వస్తాయి. కొందరు స్వాముల పేర్లూ మార్మోగుతాయి.

ప్రతి రాజకీయ పార్టీ తన స్థాయిని బట్టి ఎన్నికల్లో పోటీచేసే తన అభ్యర్థికి కొంత సొమ్ము ఇచ్చుకుంటుంది. ఆ అభ్యర్థి ఆ సొమ్మును అంతాగాని, కొంత దాచుకుని కొంతగాని ఓటర్లకు

ఇచ్చుకుంటాడు.

మైనార్టీలో ఉండీ అధికారంలో ఉన్న పార్టీ తన బలం పెంచుకోడానికి ఇతర పార్టీల సభ్యులకు డబ్బు ఇచ్చి వాళ్లను కొంటుంది.

ఆగస్టు 1993లో పి.వి. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు పార్లమెంటు సభ్యులను కొన్నారని ఈ మధ్య బి.జె.పి. ఆరోపించింది. ఆ మాట నిజమేనంటూ జనవరిలో బి.జెపి.లో చేరిన జార్ఖండ్ ముక్తి మోర్చా, బీహార్ పార్లమెంటు సభ్యుడు శైలేంద్రమహతో బహిరంగంగా చెప్పాడు. నలభై లక్షలు ముట్టిందన్నాడు. ఇలాంటి వాళ్ళ వల్లే పి.వి. ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కిందనుకోవచ్చు.

మహతో ప్రకటన చేసినపుడు ఆ పక్కనే ఉన్న వాజపేయి "పుచ్చుకున్న వారు అపరాధి అయితే, ఇచ్చుకున్న వారు మహాపరాధి" అన్నాడు. వాజపేయి వ్యాఖ్యానం బావుంది. అయితే, పుచ్చుకున్నవాడు తన పార్టీ వాడే కావడం వల్ల ఇచ్చుకున్న వాణ్ణి మహాపరాధి అన్నాడేమో?

పుచ్చుకునే వాళ్ళుండటం వల్లే ఇచ్చుకునే వాళ్లుంటారా? ఇచ్చుకునే వాళ్ళుండటం వల్లే పుచ్చుకునే వాళ్ళుంటారా? ఇది చెట్టు ముందా, విత్తు ముందా అనేటంత జటిలమైన ప్రశ్న కాదేమో...

మహా అయితే, అపరాధి-మహాపరాధి అటూ ఇటూ అవుతారు. అంతే.

1-3-96
వార్త దినపత్రిక,